నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, మంగళవారం 17 డిసెంబర్ 2024 | VIKARABAD

## ఆరునెలలుగా అదనపు కలెక్టర్ పోస్ట్ ఖాళీ..




రంగారెడ్డి, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పోస్టు గత ఆరునెలలుగా ఖాళీగా ఉన్నది. లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన భూపాల్‌రెడ్డి సస్పెన్షన్‌కు గురైన తర్వాత ఆ పోస్టులో ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు. దీంతో రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ఈ సమస్యలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అదనపు బాధ్యతలు తీసుకున్నారు. భూ సమస్యల్లో అత్యంత కీలకమైన సమస్యలకు సత్వర పరిష్కారం లభించడంలేదు. అలాగే, రెవెన్యూ పరమైన కేసులూ వాయిదా పడుతున్నాయని జిల్లావాసులు వాపోతున్నారు. ప్రస్తుతం ఒకే అదనపు కలెక్టర్ ఉండడం వల్ల లోకల్ బాడీ సమస్యలతో పాటు రెవెన్యూ పరమైన సమస్యలనూ ఆమెనే చూడాల్సి వస్తున్నది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి జిల్లా రెవెన్యూకు సంబంధించిన అదనపు కలెక్టర్‌ను నియమించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

### కేసుల పరిష్కారంలోనూ..

జిల్లాలో రెవెన్యూపరమైన సమస్యలు పెద్ద మొత్తంలో ఉన్నాయి. సమస్యలపై జాయింట్ కలెక్టర్ వద్ద ప్రతి శనివారం ఈ కేసులపై విచారణ కొనసాగుతున్నది. రెవెన్యూపరమైన జేసీ లేకపోవడం వల్ల ఈ కేసుల బాధ్యతను లోకల్‌బాడీ చూసే అదనపు కలెక్టర్‌కే కేటాయించారు. ఈ కేసులకు సంబంధించి పూర్తి వివరాలు అదనపు కలెక్టర్ వద్ద లేకపోవడం వల్ల కేసులు వాయిదా పడుతున్నట్లు జిల్లావాసులు వాపోతున్నారు. నూతనంగా వచ్చిన కలెక్టర్ నారాయణరెడ్డి పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయా తహసీల్దార్లు, ఆర్డీవోల లాగిన్‌లలో ఉన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పంపించాలని ఆదేశాలు జారీ చేశారు. తహసీల్దార్లు, ఆర్డీవోల స్థాయిలో ఉన్న సమస్యలను ఇప్పటికే జాయింట్ కలెక్టర్ రెవెన్యూ దృష్టికి పంపించారు. ఆ కేసుల భారం కూడా అదనపు కలెక్టర్ చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.


శంషాబాద్‌లో పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ నారాయణరెడ్డి

## రెండో రోజూ సజావుగా గ్రూప్-2

రంగారెడ్డి, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ)/వికారాబాద్ : ఉమ్మడి జిల్లాలో సోమవారం నిర్వహించిన గ్రూప్–2 పరీక్షలు రెండోరోజూ సజావుగా ముగిశాయి. రంగారెడ్డి జిల్లాలో 90 సెంటర్లలో పరీక్షలు నిర్వహించగా, 42 శాతం మంది, వికారాబాద్ జిల్లాలో 30 సెంటర్లలో పరీక్షలు నిర్వహించగా, 40 శాతం మంది అభ్యర్థులు మాత్రమే పరీక్షలకు హాజరయ్యారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 5:30గంటల వరకు పరీక్షలు నిర్వహించగా, పలువురు అధికారులు, రంగారెడ్డి, వికారాబాద్ కలెక్టర్లు, వికారాబాద్ ఎస్పీ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.


వికారాబాద్‌లోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

## లగచర్ల రైతులపై అక్రమ కేసులు ఎత్తేయాలి

### మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



బడంగ్‌పేట, డిసెంబర్ 16 : కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు నేడు మహేశ్వరం నియోజకవర్గంలోని అన్ని అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి వినతి పత్రాలను ఇవ్వాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రైతులపై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా థర్డ్ డిగ్రీ ఉపయోగించి.. జైలులో పెట్టడం బాధాకరమని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేత ధోరణిని అవలంబిస్తున్నదని, నేడు రైతుల తరఫున జరిగే నిరసన కార్యక్రమాలకు ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలుపాలని కోరారు.

## ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

### ప్రభుత్వ తీరుపై గళ మెత్తిన ప్రజాసంఘాలు

**ఓవైపు విద్యాశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు.. మరోవైపు మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నాలు**


కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు


మధ్యాహ్న భోజన కార్మికులను అరెస్టు చేస్తున్న పోలీసులు

రంగారెడ్డి, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి కలెక్టర్‌రేట్ సోమవారం ధర్నాలతో దద్దరిల్లింది. ప్రభుత్వ విధానాలపై ప్రజాసంఘాల నేతలు ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇచ్చినమాట నిలబెట్టుకోకపోవడంతో నిరసన జ్వాల ఎగిసిపడింది. పెండింగ్ వేతనాలను చెల్లించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగులు భారీగా తరలి వచ్చి నిరసన గళమెత్తారు. మరోవైపు విద్యాశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేశారు. వీరు పది రోజులుగా ధర్నాను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న, శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ కవిత, సీఐటీయూ జిల్లా నాయకులు కృష్ణ, ఏర్పుల నర్సింహ తదితరులు మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం, గుడ్ల బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం పది డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. జిల్లా సమగ్ర శిక్షణ ఉద్యోగుల సంఘం నాయకులు అబ్దుల్ అజీజ్, సంపత్, గిరీశ్ మాట్లాడుతూ జిల్లాలో కాంట్రాక్ట్ పద్ధతిన విద్యాశాఖలోని సమగ్ర శిక్షా అభియాన్‌లో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి ఉద్యోగికి రూ.20 లక్షల జీవిత బీమా, రూ.10 లక్షల ఆరోగ్య బీమా చేయించాలని కోరారు. ఉద్యోగ విరమణ చేస్తున్న ఉద్యోగులకు బెన్‌ఫిట్స్ కింద రూ.25 లక్షలు ఇవ్వాలని కోరారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని వారు హెచ్చరించారు.


రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

## రోడ్డు పనులు ప్రారంభించకుంటే.. ఉద్యమమే..

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి
- ఎన్‌హెచ్-163పై ప్రభుత్వం, అధికారులు చెప్పేవని అబద్ధాలే..
- ఎన్జీటీజీ అడిగిన ఈఐఏ రిపోర్టునూ అందించలేదని మండిపాటు

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 16 : నేషనల్ హైవే 163 పెండింగ్ పనుల విషయంలో ప్రభుత్వం, అధికారులు అన్నీ అబద్ధాలే చెబుతున్నారని.. కనీసం ఎన్జీటీజీ అడిగిన రిపోర్టులూ సబ్మిట్ చేయలేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం మండలంలోని కేసారం పరిధి బృందావన్‌కాలనీలో బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ పోలీస్ అకాడమీ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు పనులు చేపట్టాలని నాలుగైదు నెలలుగా తాము ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నామని.. నిరసన తెలిపిన ప్రతిసారీ అధికారులు ఏదో ఒక కారణం చెప్పి తప్పించుకుంటున్నారన్నారు. వాస్తవాలు తెలుసుకునేందుకు కొందరు లీడర్లు, పాత్రికేయులతో కలిసి డిసెంబర్ 13న చెన్నై ఎన్జీటీలో ఫైనల్ హియరింగ్‌కు వెళ్లామని..అక్కడికెళ్లాక అధికారులు ఇన్నాళ్లు చెప్పింది అబద్ధమని తమకు అర్థమైందన్నారు. ఈ రోడ్డు స్టేట్ హైవేస్ నుంచి నేషనల్ హైవేగా అప్‌గ్రేడ్ అయ్యిందని, ఈ మేరకు 2018–19లో డీపీఆర్ తయారు చేసి టెండర్లు ఆహ్వానించాలని నేషనల్ హైవే అధికారులు స్థానిక ఆర్‌అండ్‌బీ అధికారులకు పంపించారన్నారు. ఆ తర్వాత 2021లో ఈ రోడ్డు మంజూరైందని, ఈ విషయాన్ని కేంద్ర మంత్రి ట్వీట్ చేశారని గుర్తుచేశారు.

### ఎన్జీటీజీ వెళ్లిన స్వచ్ఛంద సంస్థ

తర్వాత 'సేవ్ బనియన్స్' అనే స్వచ్ఛంద సంస్థకు చెందిన వారు ఎన్జీటీజీకి వెళ్లారు. దీనిపై 2023 నవంబర్6న ఎన్జీటీ క్లియర్ డైరెక్షన్ ఇచ్చిందన్నారు. అయితే ఈఐఏ(ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్) రిపోర్ట్‌ను 4 నెలల్లో సబ్మిట్ చేసి పనులు ప్రారంభించుకోవచ్చునని సూచించిందన్నారు. కానీ, ఇప్పటివరకు వారు సబ్మిట్ చేయలేదని, మొన్న ఎన్జీటీకి వెళ్లినప్పుడు జడ్జిలు అడిగితే తెల్లమొహం వేశారన్నారు. దీంతో కొత్తగా జూలాజికల్ సర్వే రిపోర్ట్ కూడా ఇవ్వాలని చెప్పి న్యాయమూర్తులు తీర్పును రిజర్వ్ చేశారన్నారు. రోడ్డు పనులు చేయిస్తే ఎంపీ, ఎమ్మెల్యేకు తానే సన్మానం చేస్తానని కార్తీక్‌రెడ్డి స్పష్టం చేశారు. రోడ్డు పనుల విషయంలో ప్రభుత్వం కాలయాపన చేస్తే ప్రజా ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఆంజనేయులు, ప్రభాకర్, శ్రీధర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, దశరథ్, సులోచ, మాధవ్‌రెడ్డి, రాజు, ఆంజనేయులు గౌడ్, శివారెడ్డి, రవీందర్, విఘ్నేశ్‌గౌడ్, అబ్దుల్ ఘని, రామాగౌడ్, బ్యాగరి సుదర్శన్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి

## బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలి

నవాబుపేట : మండలంలోని అన్ని గ్రామాల్లోని బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని.. కష్టపడిన ప్రతి కార్యకర్తకూ పార్టీ అధికారంలోకి రాగానే తగిన గుర్తింపు ఉంటుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో జరుగుతున్న మాణిక్‌ప్రభు స్వామి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నవాబుపేట బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించడంతోపాటు పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఏడాది దాటినా ఇంకా రైతుభరోసా ఇవ్వలేని దుస్థితిలో రేవంత్ సర్కారు ఉన్నదని మండిపడ్డారు. రైతుల కష్టాలు తెలిసిన నాయకుడు కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు సమయానికి వచ్చేవని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. అంతకుముందు బీఆర్ఎస్ నవాబుపేట మండలాధ్యక్షుడు దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రుణమాఫీ నాల్గో విడతతో అందరి పంట రుణాలను మాఫీ చేశామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నదని మండిపడ్డారు. నాల్గో విడతలో ఎంతమంది బ్యాంకు ఖాతాల్లో డబ్బు జమ అయ్యిందో చెప్పే దమ్ము సర్కారుకు ఉందా..? అని సవాల్ విసిరారు. ప్రభుత్వ మోసపూరిత హామీలను ప్రజలకు వివరించి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ బలం ఏమిటో చూపిస్తామన్నారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రకాశం, నాగరాజు, సామ్యూల్, మహేందర్, బాల్‌రాజ్, రమేశ్, కృష్ణ, అశోక్, దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరగా వారికి కార్తీక్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు ఆంజనేయులు, బీఆర్ఎస్ గౌరవాధ్యక్షుడు భరత్ రెడ్డి, ప్రధాన సలహాదారు విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్లు శాంతికుమార్, వడ్ల , కోశాధికారి జగన్‌రెడ్డి, పురుషోత్తంచారి, ముఖ్యసలహాదారు సయ్యద్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## టెండర్లు లేకుండానే పనులు!

### కొన్నిచోట్ల సగం, ఇంకొన్నిచోట్ల పూర్తిగా..

### పెద్దఅంబర్‌పేటలో అధికారుల పర్యవేక్షణ కరువు

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 16 : 'ఫలానా వీధిలో ప్రగతి పని కోసం కౌన్సిల్‌లో తీర్మానం చేయాలి.. ఇంజినీరింగ్ అధికారులు ఎస్టిమేషన్ వేయాలి.. టెండర్లు పిలవాలి.. షెడ్యూల్ వివరాలను పత్రికల్లో ప్రచురించాలి.. ఆన్‌లైన్ టెండర్లు కావడంతో లెస్ కోట్ చేసిన వారు పనులు దక్కించుకోవాలి.. ఆ కాంట్రాక్టరు పనులు సకాలంలో పూర్తి చేయాలి.. అదే సమయంలో క్వాలిటీ కంట్రోల్ ఏజెన్సీలు పనులు పరిశీలించాలి.. నాణ్యతగా ఉన్నాయని నివేదిక ఇస్తేనే బిల్లులు ఇవ్వాలి.. ఏ మున్సిపాలిటీలోనైనా ఏదైనా పని చేయాలంటే జరిగే ప్రక్రియ ఇదీ..'

కానీ, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలోని పలువురు ప్రజాప్రతినిధులు చట్టం చెబుతున్న నిబంధనలకు నీళ్లొదిలారు. కౌన్సిల్‌లో తీర్మానం ఆమోదం పొందగానే కొందరు ప్రజాప్రతినిధులు నేరుగా పనులు మొదలు పెట్టేశారు. ఎలాంటి టెండర్ల ప్రక్రియ చేపట్టకుండానే పనులు ప్రారంభించారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పనులు దాదాపు సగం పూర్తయినా ఇంకా టెండర్ల ప్రక్రియ మొదలు కాని పరిస్థితి నెలకొన్నది. రూ.కోట్ల విలువైన పనులపై పర్యవేక్షణ కొరవడింది. టెండర్లు కాకుండానే పనులు పూర్తవడంతో నాణ్యత పరీక్ష ఎలా సాధ్యమవుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపాలిటీలో కొన్ని వార్డులు మినహా అన్ని వార్డుల్లో ఈ తరహా పనులు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

### పనులు చకచకా.. టెండర్లు తీరికగా..

మున్సిపల్ పాలకవర్గాల గడువు సమీపిస్తుండడంతో వార్డుల్లో జోరుగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చకాచకా నడుస్తున్నాయి. అయితే, వాటిపై అధికారుల పర్యవేక్షణ కరువైంది. కనీసం పనుల వైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పనులు నాణ్యతగా లేకపోతే త్వరగా పాడయ్యే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు విన్నవించుకున్నా అధికారులు అటువైపు చూడడంలేదని విమర్శిస్తున్నారు. ఇదిలా ఉంటే పలువురు ప్రజాప్రతినిధులు చేపడుతున్న పనులకు అసలు టెండర్లే పిలవలేదనే ఆరోపణలు ఉన్నాయి. టెండర్ల ప్రక్రియను ప్రారంభించకముందే పనులు మొదలు పెట్టినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. ఎస్టిమేషన్, టెండర్లే పిలువకుండా చేపడుతున్న పనులను అధికారులు ఎలా పరిశీలిస్తారనే విషయం సంశయంగా మారింది. ఇలా పలు వార్డుల్లో కలిపి రూ.కోట్ల విలువైన అభివృద్ధి పనులు నడుస్తున్నాయనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. కొన్నిచోట్ల పనులు పూర్తి కాగా, మరికొన్ని చోట్ల సగం వరకు పూర్తయ్యాయి. అధికారుల పర్యవేక్షణ కరువైన వేళ వేసిన సీసీ రోడ్లకు పూర్తిస్థాయిలో నీళ్లు పెట్టడంలేదని స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నారు. ఇటీవల పెద్దఅంబర్‌పేటలోని ఓ వార్డులో రోడ్లకు నీళ్లే పట్టడంలేదని స్థానికులు ఫిర్యాదు చేసినా అధికారులు అటువైపు చూడలేదనే విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించాలని, పనులు నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ప్రజలు కోరుతున్నారు.


పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలో టెండర్ లేకుండా వేసిన రోడ్డు